విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
మంగళవారం 22 జూలై 2025

# ముగ్గురు నిందితులు అరెస్టు

## రూ. 19 లక్షల విలువ చేసే 19 ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటో స్వాధీనం

- ముగ్గుర్ని అరెస్టు చేసిన అనంతపురం టూటౌన్ పోలీసులు
- మీడియాకు వివరాలు వెల్లడించిన అనంతపురం అర్బన్ డీఎస్పీ

అనంతపురం, జూలై 21 (అనంత ప్రభ)

ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు నిందితులతో పాటు ఇవే కేసుల్లో ఈరోజు జువైనల్ కోర్టు ముందు హాజరు పరచనున్న నలుగురు మైనర్లు మొత్తం ఏడుగురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి అనంతపురం నగరంలోని వివిధ ప్రాంతాలలో టూవీలర్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో బైనేని యతేంద్ర అలియాస్ శివా ముఖ్యుడు. ఇతనిపై ఇదివరకే 08 టూవీలర్ దొంగతనాలు కేసులున్నాయి. అనంతపురంతో పాటు ధర్మవరం, నల్లచెర్వు, తదితర ప్రాంతాలలో గత రెండేళ్ల కిందట నుండీ టూవీలర్లు ఎత్తికెళ్లిన కేసులున్నాయి. మిగితా ముఠా సభ్యులను కలుపుకుని రాత్రి, పగలు తేడా లేకుండా ఇళ్ళ ముందు, హాస్పిటల్స్ దగ్గర పార్కు చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చేసుకుంటారు. నకిలీ తాళాల సహాయంతో పార్క్ చేసిన వాహనాలను సులువుగా ఎత్తుకెళ్లడం వీరికి రివాజు...

అరెస్టు మరియు అదుపులోకి తీసుకోవడం:- అనంతపురము జిల్లాలో గత కొద్ది నెలలుగా మోటార్ సైకిల్స్ దొంగతనం కావడంతో సదరు దొంగలను పట్టుకోవడానికి సవాల్ గా స్వీకరించిన అనంతపురము జిల్లా ఎస్పీ శ్రీ. పి. జగదీష్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, అనంతపురము అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు గారు అద్వర్యములో , అనంతపురము 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీకాంత్ గారు, యస్.ఐ సి.రుషేంద్ర బాబు మరియు అనంతపురము 2 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి పక్కా సమాచారం మేరకు, 21-07-2025 తేదీ ఉదయం నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేయుచుండగా, ప్రసన్నాయ పల్లి రైల్వే స్టేషన్ వైపు నుండి ఒక లగెజి ఆటో లో ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడం చూసి వారిని పట్టుకుని విచారించగా, వారి విచారణలో సదరు ఏడుగురు వ్యక్తులు జల్సాలకు అలవాటుపడి అనంతపురము 2 టౌన్, 4 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 19 మోటార్ సైకిల్ తో పాటు, ఒక లగెజి ఆటో దొంగతనం చేశామని వారు ఒప్పుకున్నారని, వారి వద్ద నుండి 19 మోటార్ సైకిల్ తో పాటు, ఒక లగెజి ఆటో ను రికవరీ చేసి వారిని అరెస్టు మరియు అదుపులోకి తీసుకోవడం జరిగిందని, రికవరీ చేసిన మోటార్ సైకిల్స్, లగెజి ఆటో విలువ సుమారు 19లక్షల రూపాయలు ఉంటుందని అనంతపురము అర్బన్ డిఎస్పి వి.శ్రీనివాస రావు గారు విలేకరుల సమావేశంలో వివరించారు.



నిందితుల వివరాలు :

1) బైనేని యతేంద్ర అలియాస్ శివా, వయస్సు 20 సంలు, కోట కొట్టాలు, ఆకుతోటపల్లి గ్రామము, ఎస్కేయు , అనంతపురము రూరల్ మండలం

2) బోగిశెట్టి యోగేశ్వర్ అలియాస్ యోగి, వయస్సు 27 సం.లు, వీవర్స్ కాలనీ, ఆకుతోటపల్లి గ్రామము, అనంతపురము రూరల్ మండలమం

3) సి.యశ్వంత్ కుమార్ అలియాస్ బన్నీ, వయస్సు 19 సం.లు, గంగానగర్, అనంతపురము

ఈ ముగ్గురితో పాటు మరో నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకుని జువైనల్ కోర్టు ముందు హాజరు పెట్టనున్నాము

ప్రశంస :- మోటార్ సైకిల్స్ ను మరియు ఆటో ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను అందరినీ, జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ గారు ప్రత్యేకంగా అభినందించారు ఎస్పి గారు అభినందించిన వారిలో, అనంతపురము అర్బన్ డీఎస్పీ శ్రీ. వి.శ్రీనివాస రావు గారు, అనంతపురము 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీకాంత్ , యస్ .ఐ సి.రుషేంద్ర బాబు, హెడ్ కానిస్టేబుల్ ఎం.టి.రాజశేఖర్ రావు, జె.అమరేశ్వర రావు, పోలీసు కానిస్టేబుల్స్ జి.సుధాకర్, టి.అంజన్ కుమార్, వి.రామాంజినేయులు, బి.వన్నూరు స్వామి, శేఖర్ జి.షాషావలి , డి.రామకృష్ణ, పి.జి. సురేశ్, హోమ్ గార్డ్ షేక్షావలి ఉన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతపురము అర్బన్ డీఎస్పీ శ్రీ. వి.శ్రీనివాస రావు గారు, అనంతపురము 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీకాంత్ , యస్ .ఐ సి.రుషేంద్ర బాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి



పుట్టపర్తి, జూలై 21 (అనంత ప్రభ)

తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వచ్చే అర్జీదారుల సమస్యలను.. అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ డిఆర్వో పార్థసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ,రామ సుబ్బయ్య, ఆర్డీవో సువర్ణలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ మాట్లాడుతూ....ప్రజలు గుమికూడే ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే తాగునీరు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి సౌకర్యాలను కల్పించారో వాటి వివరాలు ప్రజలకు తెలిసేవిధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు.

# రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు

- ప్రవేశం నుండి పుస్తకాల వరకూ - విద్యా మార్గం సులభతరం చేసిన బీజేపీ
- విన్నవించగానే స్పందన - 28 మంది బాలికలకు కేజీబీవీ ప్రవేశం కల్పించిన మంత్రి సత్య కుమార్ యాదవ్.
- పదో తరగతి తర్వాత ఇంటర్ కూడా మేమే చూసుకుంటాం - హరీష్ బాబు స్పష్టం.

ధర్మవరం, జూలై 21 (అనంత ప్రభ)

ధర్మవరం నియోజకవర్గంలోని పలు పేద కుటుంబాల తల్లిదండ్రులు ఇటీవల ధర్మవరం లోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయాన్ని సంప్రదించి, తమ కుమార్తెలకు ధర్మవరం నియోజకవర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో (కేజీబీవీ) ప్రవేశం కల్పించాలని విన్నవించారు. విషయాన్ని మంత్రి కార్యాలయ సిబ్బంది మంత్రి కి తెలియజేయగా, వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి 28 మంది బాలికలకు ప్రవేశం కల్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బంది కేజీబీవీ పాఠశాల అధికారులతో సంప్రదించి సకాలంలో పిల్లలకు ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా నేడు మంత్రి గారి తరపున, ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, మంత్రి గారి శుభాకాంక్షలతో కూడిన వ్యక్తిగత లేఖలను తల్లిదండ్రులకు అందించారు. మంత్రిగారి లేఖలో ఇటీవలి కాలంలో మీరు ధర్మవరంలోని నా కార్యాలయానికి వచ్చి, మీ కుమార్తెకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశం కల్పించాలని చేసిన విన్నపం నా దృష్టికి వచ్చింది. మీ కోరిక మేరకు



నా కార్యాలయం సిబ్బంది, సంబంధిత అధికారులతో మాట్లాడి, పాఠశాలలో ప్రవేశం మంజూరు చేయించారు. ఈ అవకాశం మీ కుమార్తె ఉజ్వల భవిష్యత్తుకు నాంది అవుతుందని, నాణ్యమైన విద్య, సమగ్రమైన అభివృద్ధి, సురక్షిత వాతావరణం ఈ పాఠశాలలో ఆమెకు లభిస్తాయని నేను విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలందరికీ అవసరమైన పుస్తకాలు కూడా పంపిణీ చేయబడ్డాయి. కార్యక్రమాన్ని నిర్వహించిన హరీష్ బాబు మాట్లాడుతూ, ఈ విద్య అవకాశాన్ని బాగా వినియోగించుకొని, పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే, వారి ఇంటర్మీడియట్ చదువు బాధ్యతను కూడా మేమే తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్ర, బత్తలపల్లి మండల అధ్యక్షులు భాస్కర్, ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంక నాగార్జున, పోతుకుంట రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# సుపరిపాలనలో ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత

మడకశిర, జూలై 21 (అనంత ప్రభ)

సుపరిపాలన ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత గారు, బిసి ,జౌళి శాఖ మాత్యులు సవిత , ఎమ్మెల్యే ఎంఎస్ రాజు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గారు.

మండల కేంద్రంలో బ్రహ్మరథం పడుతున్న ప్రజలు మహిళలు. మంగళ వాయిద్యాలు హారతులతో ఘన స్వాగతం పలికిన నాయకులు.

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు యువ నాయకులు మంత్రివర్యులు నారా లోకేష్ బాబు గారి ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ ఉత్సాహంగా ప్రజలతో తిరుగుతూ ఇంటింటికీ కరపత్రాలతో వెళ్లి కూటం ప్రభుత్వం సుపరిపాలన



గురించి వివరించారు,


స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అధికారులతో మాట్లాడారు, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సుపరిపాలన అందించామని చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, దీపం పథకం, మెగా డీఎస్సీ, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఏర్పాటు, మడకశిర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించార

# నియోజకవర్గ అభివృద్ధే మన లక్ష్యం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

- రానున్న నాలుగేళ్లలో రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి చూస్తారు
- మన్నీల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం
- గత ఐదేళ్లకి -ఈ ఏడాదిలో వచ్చిన మార్పు ప్రజలు గమనించాలన్న సునీత

ధర్మవరం, జూలై 21 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల సునీత రాగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో 20లక్షల ఎన్ఆర్ఈజీఎస్, మండల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు వంటి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. తమకు పథకాలన్నీ అందుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. కొన్ని చోట్ల ముగ్గరు పిల్లలు ఉన్నా తమకు పథకాలు అందాయన్నారు. అలాగే గ్రామంలో కొన్ని సమస్యలను కూడా ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన్నీల గ్రామంలో సంక్షేమ పథకాలు ఎంత మందికి అందాయన్నది వివరించారు. 6.39లక్షలతో మూడు గోకులం షెడ్స్,



8మందికి 9లక్షల సబ్సిడీతో స్ప్రింకర్లు, డ్రిప్పు అందజేసినట్టు చెప్పారు. ఐకేపీ ద్వారా డ్వాక్రా మహిళా సంఘాలకు 39లక్షల మేర రుణాలు ఇచ్చినట్టు చెప్పారు. అనంతపురం రూరల్ మండలంలో రికార్డు స్థాయిలో 13కోట్లతో రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. 17,504 మందికి సంవత్సరానికి 94.22 కోట్ల రూపాయల మేర పింఛన్లు అందించామన్నారు. 64 మందికి 64 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించినట్టు చెప్పారు. 49.57 కోట్లతో 33,361 గృహాలకు కొళాయి కనెక్షన్లు అందజేసినట్టు చెప్పారు. 18,934 మందికి తల్లికి వందనం కింద 24.61 కోట్ల రూపాయలు అందజేసినట్టు వివరించారు. ఒక్క ఏడాదిలో ఇంత అభివృద్ధి సంక్షేమం చేసి చూపించామన్నారు. గత ఐదేళ్లకి ఇప్పటికీ తేడా గమనించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. కేవలం అభివృద్ధి, సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు చెప్పారు..

# అంగన్వాడి లబ్ధిదారులకు మానువల్ గా సరుకులు పంపిణీ చేయండి

## ఐ సి డి ఎస్ కార్యాలయం వద్ద లబ్ధిదారు లు నిరసన

శింగనమల, జూలై 21 (అనంత ప్రభ)

అంగన్వాడి కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న గర్భిణీలకు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టిక ఆహార నిత్యావసర సరుకులను.. మ్యానువలుగానే పంపిణీ చేయాలని అంగన్వాడి కేంద్రాల లబ్ధిదారులు సింగనమల ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సింగనమల ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడి సెంటర్లో ఉన్న లబ్ధిదారులు పౌష్టికాహార నిత్యవసర సరుకులు పంపిణీ విధానం పై నిరసన వ్యక్తం చేశారు.... అధికారులకు వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. కేంద్రాల్లో గతంలో బాలింతలకు గర్భిణీలకు కేవలం సంతకం చేయించుకొని భర్తగాను భారత్ అను ఇచ్చే వారిని.. అయితే ప్రస్తుతం లబ్ధిదారులకు పేస్ యాప్ ద్వారా వస్తువులను పంపించడం చాలా ఇబ్బందిగా ఉంది అన్నారు... లబ్ధిదారులు అంగన్వాడి సెంటర్ వచ్చినప్పుడు పేస్ యాప్ కు సర్వర్ లేక సరుకులను గంటలకు ఆలస్యంగా ఇవ్వడం జరుగుతుందని.. అంతేగాక



ఒక్కొక్క లబ్ధిదారులు రెండు మూడు రోజులు కార్యాలయం.. సెంట్రల్ చుట్టూ తిరిగే పరిస్థితి అన్నారు... గర్భిణీలను వైద్యులు ఎక్కువ రెస్ట్ తీసుకోమని తెలుపుతున్నారని.. అయితే సెంట్రల్ వద్దకి సరుకులు తీసుకోవడానికి తినడంతో అనారోగ్యానికి గురి అవుతే... అంగన్వాడి లే బాధ్యత వహించాలని లబ్ధిదారులు తీవ్రంగా విభేదించారు... ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెంటర్ల అధ్యక్షురాలు రమణమ్మ, భారతి, ప్రమీల, రామాంజనమ్మ, రుసింగమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడి హెల్పర్స్,, నారాయణమ్మ, రమణమ్మ, వినీత, లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జూలై 21 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని రాఘవేంద్ర కాలనీ ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో సారెడ్డి సోమశేఖర్ రెడ్డి, భార్య ఓలమ్మ వారి కుమారుడు సారెడ్డి రంగస్వామి రెడ్డి, కోడలు చైతన్య, మనవళ్లు విహాన్, దైవిక్ వీరు ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. వారి పెద్ద కుమారుడు విహాన్ రెడ్డి 9వ పుట్టినరోజు శుభ సందర్భంగా అగాపే ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకొని, యాడికిలో నివాసం ఉంటున్న వారి తల్లి తండ్రి ద్వారా విహాన్ బర్త్డే సందర్భంగా కొడుకు, కోడలు ఇక్కడికి రాలేకపోయినా, ఆశ్రమంలోని నిరాశ్రయులకు భోజనాలు వడ్డించి అన్నదానం చేశారు. ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు

## సుపరిపాలనలో తొలి అడుగు



యాడికి, జూలై 21 (అనంత ప్రభ)

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని యాడికి మండల పరిధిలోని తూట్రాళ్లపల్లి గ్రామములో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాలతో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గ్రామములోని ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎడాది కాలములో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణి చేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో గుత్తా శ్యాంసుందర్, గుత్తా ప్రభాకర్ నాయుడు, కూచి చెన్నయ్య, వేలూరి ఆదినారాయణ, వేలూరు ధనుంజయ, గుత్తా విజయ్ కుమార్, కూచి చంద్ర, హరి, రమేష్, గురివిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లాలో దళితలపై దాడులు మరియు అత్యాచారాలు అరికట్టాలి



మడకశిర, జూలై 21 (అనంత ప్రభ)

ఉమ్మడి జిల్లాలో దళితలపై దాడులు మరియు దళిత మహిళ విద్యార్థిలపై జరుగుతున్నటువంటి అత్యాచారాలు అరికట్టాలి,మరియు అత్యాచారం పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఆ బాధిత కుటుంబాలకి భరోసా కల్పించాలని హెూంమినిస్టర్ వంగలపూడి అనిత గారికి వై-యస్సార్ పార్టీ జిల్లా ఎస్సీ విభాగం తరపున వినతి పత్రాన్ని ఇవ్వడానికి వెళితే మమ్మల్ని పోలీసులు అడ్డుకొని రోడ్డు మీద నిర్బంధించి పోలీస్ స్టేషన్ తీసుకురావడం జరిగినది ఏది ఏమైనా ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది పోలీస్ స్టేషన్ నిర్బంధించిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి మరియు టిడిపల్లి రంగనాథ్ సికిందరు ఎమ్మార్పీఎస్ పుట్టపర్తి అధ్యక్షుడు గంగాధర్ తదితరులని పోలీస్ స్టేషన్ లో నిర్భందించడం జరిగినది

## అనంతపురంప్రెస్ క్లబ్ అభివృద్ధి కొరకు సహాయం చేయండి నందు టైమ్స్ (సి.ఈ.ఓ )భాస్కర్ రెడ్డిమంజునాథరెడ్డి



అనంతపురం, జూలై 21 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజు కూటమి యమ్.పి.అంబికా లక్ష్మి నారాయణ ను ప్రెస్ క్లబ్ కమిటీ మెంబెర్స్ అజాద్,భాస్కర్ రెడ్డి,రవికుమార్ ప్రెస్ క్లబ్ అభివృద్ధి కొరకుసహాయ పడాలని విన్నవించడం జరిగింది. అధ్యక్షుడు ఆజాద్ మరియు సెక్రెటరీ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి

అయితే కొన్ని దిన పత్రికలు ప్రచురించాయి సంతోషం.మరికొన్ని పత్రికలు కూడా సానుకూలంగా స్పందించి వార్త రూపంలో అందరికీ తెలిసే విధంగా తెలియజేయాలని ప్రెస్ క్లబ్ కమిటీ విన్నపం.

## నిరుపేదల భవిష్యత్తు కోసం కేంద్రం ఆర్డిటి సేవలను కొనసాగించాలి

కూడేరు, జూలై 21 (అనంత ప్రభ)

కూడేరు మండలం మరుట్ల-2 హైస్కూల్ విద్యార్థి విద్యార్థినీల చేత 150పోస్ట్ కార్డుల ద్వారా ఆర్డిటి పరిరక్షణ జేఏసీ సమితి సభ్యులు ఆధ్వర్యంలో జాబ్ కార్డులు పై ఆర్ డి టి ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ చేయాలంటూ విద్యార్థులచే లేక వ్రాయించిన సందేశాన్ని కేంద్రానికి పంపారు. 21.07.2025న ఆర్డిటిని పరిరక్షించుకుందాం అనే నినాదంతో జిల్లా మొత్తం ఒక లక్ష పోస్ట్ కార్డులను వ్రాయాలనే తలంపుతో అడ్వకేట్ ప్రతాప్ రెడ్డి ప్రతి మండలం నుంచి 1600 పోస్ట్ కార్డులను రాయించుటలో భాగంగా 150పోస్ట్ కార్డులను ఆర్డిటికీ ఎఫ్.సి. ఆర్.ఏ ను పునరుద్దించండి అనే నినాదంతో అభ్యర్థన తో కూడిన లెటరు ను మన దేశ హెూం మంత్రివ-ర్యులు శ్రీ అమిత్ షా కు లెటర్ రూపకంగా విజ్ఞప్తులు




చేస్తు వ్రాయించడం జరిగింది. ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ పునరుద్దించి పేద ప్రజలను కాపాడలని కేంద్రానికి లేక రూపంలో విన్నవించారు. ఈ కార్యక్రమంలో కరట్లపల్లి అక్కమ్మ నారాయణపురం సిబిటి ముత్యాలు, ఇప్పేరు సుబ్బరాయుడు, సిబిటి జయపురం సంజీవరాయుడు, ముద్దలాపురం పెన్నోబులేసు, మరుట్ల ఎర్రస్వామి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్షిప్ కు దరఖాస్తు చేసుకోండి

యాడికి , జూలై 21 (అనంత ప్రభ)

కేంద్ర ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు పీఎం ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన కింద స్కాలర్షిప్లు అందించడానికి నోటిఫికేషన్ విడుదల చేసిందని మండల విద్యాధికారి కాశప్ప తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన బ్రౌచర్లను మండల అధికారులచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాశప్ప మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హులైన విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేటప్పుడు వారికి కొంత ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం లక్ష్యమని, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, మెడికల్, ఇంజనీరింగ్ కోర్సులు చదివే 18 నుంచి 25 సంవత్సరాల



లోపు వారు అర్హులని, ఇంటర్లో 80 శాతం మార్కులు మరియు వారి కుటుంబ ఆదాయం నాలుగున్నర లక్షల లోపల ఉండాలని అండర్ గ్రాడ్యుయేట్ వారికి ఏడాదికి 12,000, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు ప్రొఫెషనల్ కోర్సులు వారికి 20 వేల రూపాయలు ఇస్తారని, ఈ పథకానికి దరఖాస్తు చేయడానికి 31 అక్టోబర్ 2025 చివరి తేదీ అని తెలిపారు

## సజావుగా జరిగిన మండల సర్వసభ్య సమావేశం






యాడికి, జూలై 21 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో యాడికి మండలాధ్యక్షురాలు బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా బొంబాయి ఉమాదేవి మాట్లాడుతూ పిన్నేపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉందని సంబంధిత అధికారులకు తెలియజేయగా ఆ శాఖ అధికారులు త్వరలోనే ఆ సమస్యకు పరిష్కారం ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు పలు శాఖల అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. రాచర్ల గ్రామానికి తాడపత్రి డిపో వారు బస్సును ఏర్పాటు చేయాలని, కొంతమంది డ్రైవర్లు మొబైల్ వాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారని ఆర్టీసీ అధికారులకు తెలియజేశారు. ఉపాధి హామీ మరియు రైతులకు సంబంధించిన పలు విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఎంపిటీసీ సభ్యులకు గౌరవ వేతనం దాదాపు రెండు సంవత్సరముల నుంచి రావడం లేదని ఎంపీడీవో వీర్రాజుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వర్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## బాలికలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన లెక్కల టీచర్ సతీష్ ను తొలగించాలి -ఐసా

ఉరవకొండ, జూలై 21 (అనంత ప్రభ)

చిన్న గడే హెూతూర్లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో పనిచేస్తున్న లెక్కలమాస్టర్ సతీష్ హై స్కూల్ విద్యార్థినుల పట్ల అనుచితంగా, అసభ్య కరంగా ప్రవర్తించిన సంఘటన ఫై ఉపవిద్యాధికారిమల్లా రెడ్డి సోమవారం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. 8,9,10వ తరగతుల్లో చదువే భాదిత బాలికలనుకలసి విచారించారు.విచారణ గుట్టుగా జరుపుతున్నారని తెలుసు కున్న అల్ ఇండియా స్టు డెంట్స్ఫెడరేషన్ విద్యార్థి సంఘం నేతలు విచారణ అధికారిని కలసి భాధ్యుడైన టీచర్ సతీష్ ను విధుల నుంచి మళ్ళీ మళ్ళీ ఇలాంటి సంఘటన లకు తావివ్వకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఐసా కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు.

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడితే అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే ఇలాంటి అకృత్యాలకు పాల్పడితే అలాంటి కీచకులు పట్ల కఠినంగా వ్యవహరించి తీరాల్సిందే అని




హెచ్చరించారు. విద్యార్థినుల పట్ల వక్రబుద్ధి చూపే వక్ర గురువులకు కఠిన దండన విధించాల్సిందే అని ఐసా కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. ఉరవకొండ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల తీరు సరిగ్గా లేదని, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ఈ యాజమాన్యాలు ఫీజు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు, ఉపాధ్యాయుల శ్రమ దోపిడీ, ఫీజుల దోపిడీ నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలని ఉపవిద్యాధికారి మల్లారెడ్డిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఐసా నాయకులు వంశీ, వంశీ,మోహన్ వినయ్ తదితరులు పాల్గొన్నారు

## తాసిల్దార్ కార్యాలయం ఎదుటధర్నా

ఉరవకొండ, జూలై 21 (అనంత ప్రభ)

రైతుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పైన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా ఈ సందర్భంగా ధర్నా ఉద్దేశించి మండల కార్యదర్శి మధుసూదన్ నాయుడు,మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ 20000 రూపాయలు ఇస్తానని హామీలలో భాగంగా ఇప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాయిదాలు వేస్తూనే ఉందన్నారు .ఇప్పటికే రైతులు పంటలు వే-సుకుని అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారన్నారు ప్రభుత్వం ఇస్తామన్న రైతులకు అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూస్తున్నారు . వెంటనే రైతులకు వ్యవసాయ కార్మికులకు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు ఉపాధి హామీ కూలీలకు గత నాలుగు నెలల నుండి పనులు చేసినటువంటి వేతనాలు చెల్లించకుండా ఏడు ఎనిమిది వారాల బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉపాధి హామీ నిధులు వేతనాలు ఉపాధి శ్రామికుల అకౌంట్లకు జమ చేయాలని డిమాండ్ చేశారు అడిగిన అన్ని గ్రామాలలో ఉపాధి హామీ



పనులు కల్పించాలని రోజు వేతనం 307 రూపాయలు చెల్లించాలని ఉపాధి హామీ శ్రామికులకు పనిముట్లు గడ్డపార పార గంప గుణపం ఇవ్వాలని డిమాండ్ చేశారు కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు వెంటనే అందరికీ ఇవ్వాలని కార్డులు ఉన్నవారికి బ్యాంకు రుణాలు అన్నదాత సుఖీభవ సబ్సిడీ విత్తనాలు ఎరువులు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మురళి ,రవి ,సిద్ధప్ప, జ్ఞానమూర్తి ,కౌలు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సురేష్ ,వెంకటేశు మండల నాయకులు సుంకన్న, బ్రహ్మయ్య, నారాయణస్వామి, తిమ్మప్ప, వన్నూరు స్వామి ,తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పయ్యావుల కేశవ ను మర్యాదపూర్వకంగా కలిసిన బాటా వెంకటేష్, జయప్రకాష్ గౌడ్



కూడేరు, జూలై 21 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల నాయకులు బాట వెంకటేష్, జయ ప్రకాష్ గౌడ్ సోమవారం రోజున రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ ను విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం కూడేరు మండలంలోని లేడీస్ ఇంటర్మీడియట్ కాలేజీతో పాటు లేడీస్ హాస్టల్ ఏర్పాటు, పేదల ఇంటి స్థలాల కేటాయింపు మరియు పార్టీ భవిష్యత్తు కార్యచరణ విధి విధానాలపై చర్చించారు. అందుకు మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు

## స్మశాన వాటికలో కంప చెట్టు తొలగింపు



ఉరవకొండ, జూలై 21 (అనంత ప్రభ)

విడపనకల్ మండలం పాల్తూరు గ్రామంలో సర్పంచ్ బ్యాలా రాణి ఆధ్వర్యంలో స్మశాన వాటికలో కంపచెట్లు వేపుగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున స్పందించి సర్పంచ్ బ్యాలా రాణి జంగ్లిలి క్లీనింగ్ చేయడం జరిగినది. కార్యక్రమం సామాజిక కార్యకర్త ఆనందరాజు రాజశేఖర్.హనుమంత తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లాలో దళిత గిరిజనుల పైనదాడులకు నిరసన గా ఈ నెల 30 న మహాధర్నా.



అనంతపురం, జూలై 21 (అనంత ప్రభ)

ఎస్సీ ఎస్టీ సమస్యలు, స్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు అట్రాసిటీ కేసుల్లో ఎస్సీ ఎస్టీల పైన కౌంటర్ కేసులు, దళిత గిరిజనుల పైన ఆకారణంగా జరిగే దాడులకు నిరసన గా ఈనెల ముప్పై వ తారీఖున అనంతపురం నగరం జిల్లా పరిషత్ ఎదురుగా గల అంబేద్కర్ విగ్రహం ముందు మహాధర్నా కార్యక్రమాన్ని దళిత గిరిజన,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ధర్నా కార్యక్రమానికి దళిత గిరిజనులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దళిత గిరిజనుల ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంటిమద్ది ఓబులేసు, యమ్.ఆర్.పి.ఎస్.సీనియర్ నాయకులు ఏపీ నారాయణస్వామి, నేరమెట్ల ఎల్లన్న, చిన్న కేశవులు ,చిన్న ఆంజనేయులు,బంగి ఓబుళపతి, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే నగేష్. బండారు చంద్ర, బాసాని శీను,

విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్,వరప్రసాద్,మండల పకీరప్ప, చెర్ల రామాంజి,బడికి రాజు బండారు,అనిల్ కుమార్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పల్లెను కలిసిన ప్రెస్క్లబ్ కమిటీ

అనంతపురం, జూలై 21 (అనంత ప్రభ)

సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని అనంతపురంలోని ఆయన స్వగృహంలో అనంతపురం ప్రెస్క్లబ్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్క్లబ్ అధ్యక్షులు ఆజాద్, కార్యదర్శి భాస్కర్రెడ్డిలు ప్రెస్క్లబ్



అభివృద్ధికి సహకరించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రెస్క్లబ్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీనిచ్చారు. మాజీ మంత్రి పల్లెను కలిసిన వారిలో ప్రెస్క్లబ్ సీనియర్ జర్నలిస్టులు జంబుల రమేష్ రెడ్డి. సాక్షి రవి, గోపాల్, కోనంకి రవి, కుంచపు భాస్కర్, హరికృష్ణ, కుళ్లాయప్ప, 6టీవీ రవి తదితరులు ఉన్నారు.

## మంత్రి పయ్యావుల కేశవ ను మర్యాదపూర్వక కలిసిన బాటా వెంకటేష్, జయప్రకాష్ గౌడ్



కూడేరు, జూలై 21 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల నాయకులు బాట వెంకటేష్, జయ ప్రకాష్ గౌడ్ సోమవారం రోజున రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ ను విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం కూడేరు మండల కేంద్రంలోని లేడీస్ ఇంటర్మీడియట్ కాలేజీతో పాటు లేడీస్ హాస్టల్ ఏర్పాటు, పేదల ఇంటి స్థలాల కేటాయింపు మరియు పార్టీ భవిష్యత్తు కార్యచరణ విధి విధానాలపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు.









# నిమ్మరసం రోజూ తాగితే.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



పసుపు పచ్చని రంగులో నిగనిగలాడే నిమ్మ ప్రకృతి మనకు ప్రసాదించిన ఓ అద్భుతమైన వరం. ఈ పుల్లటి, గుండ్రని పండులో ప్రోటీన్, కొవ్వు, విటమిన్ సి, కాల్షియం, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాల పవర్‌హౌస్. పోషకాలతో నిండి ఉన్న నిమ్మ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తాయి, మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తాయి. శరీర కణజాలం పెరుగుదల, అభివృద్ధి, మరమ్మత్తుకు విటమిన్ సీ కీలక పాత్ర పోషిస్తుంది. వేసవిలో నిమ్మరసం.. బెస్ట్ రిఫ్రెష్ డ్రింక్ అని చెప్పొచ్చు. నిమ్మరసం రోజూ తీసుకుంటే.. మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది గొంతును శుభ్రపరుస్తుంది, మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మీరు గొంతు నొప్పితో బాధపడుతుంటే.. ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లలో అరస్పూన్ తేనె, స్పూన్ నిమ్మరసం కలిపి తాగితే మీకు త్వరగా ఉపశమనం లభిస్తుంది.

కిడ్నీలో రాళ్లను దూరంగా ఉంచుతుంది..

నిమ్మరసం మూత్రంలో సిట్రేట్ స్థాయిలను పెంచి.. మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తుంది. సిట్రేట్ కాల్షియంకు అతుక్కుంటుంది, ఇది మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా సహాయపడుతుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది..

నిమ్మరసం, నిమ్మ తొక్కలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది లివర్‌లో జీర్ణ ఎంజైమ్‌ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుంది. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉన్నవారు నిమ్మరసం తీసుకుంటే చాలా మంచిది. నిమ్మరసం మీ శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. (%అఘిస్త్రవ

%బ్లడ్ షుగర్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది..

నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్‌ని అదుపులో ఉంచుతుంది.. తద్వారా చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి. నిమ్మరసం తీసుకుంటే డయాబెటిస్ వచ్చే ముప్పు తగ్గుతుంది. షుగర్ పేషెంట్స్ రోజూ నిమ్మరసం తాగితే.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి.

బరువు తగ్గుతారు..

నిమ్మకాయలో పెక్టిన్ ఉంటుంది. నిమ్మరసం మీకు కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది.. దీనిలో ఉండే లో డెన్సిటీ ఫైబర్ శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించడానికి, బరువు తగ్గించడానికి సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి..
ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది..

నిమ్మకాయల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ సి మన శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సి వాపును తగ్గిస్తుంది, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. గాయాలు వేగాంగా మానేలా తోడ్పడుతుంది. నిమ్మరసం యాంటీ ఆక్సిడెంట్ల అద్భుతమైన మూలం. ఇది ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా.. మీ కణాలను రక్షించి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది



# కొబ్బరి నూనెలో ఇది కలిపి రాస్తే చుండ్రు తగ్గి జుట్టు బాగా పెరుగుతుంది..

జుట్టు అందంగా, షైనీగా ఉంటే ఆ అందం అంత ఇంత కాదు. చూడ్డానికి అందమైన జుట్టు కావాలని అందరికీ ఉంటుంది. కానీ, అనేక కారణాలతో చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతుంటారు. అందులో జుట్టు రాలడం, చిట్లిపోవడం, చుండ్రు సమస్యలు ఉంటాయి. అయితే, ఇందులో చుండ్రు సమస్య దూరమవ్వాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

కర్పూరం..
కర్పూరాన్ని చాలా మంది తమ ఇళ్ళలో వాడుతుంటారు. దీని వల్ల జుట్టుకి కూడా మేలు జరుగుతుంది. కర్పూరాన్ని కొబ్బరినూనెలో కలిపి రాయడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో చూద్దాం.

చుండ్రు..
కొబ్బరి నూనె, కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల అది బలమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ రెండింటికి కలయిక వల్ల స్కాల్ప్ ఫంగస్, బ్యాక్టీరియా, దురద, అలర్జీలు దూరమవుతాయి.

పేలు..
చాలా మంది పేల సమస్యతో తెగ ఇబ్బంది పడతారు. కర్పూర నూనె ఆ సమస్యకి కూడా చెక్ పెడుతుంది. కర్పూరంలోని యాంటీ పరాసిటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పేలను దూరం చేస్తాయి. దీని కోసం రెండు చెంచాల కొబ్బరి నూనె, ఓ చెంచా కర్పూరాన్ని కలిపి పేస్టులా చేసి తలకి పట్టించి రాత్రంతా అలానే ఉంచి క్లీన్ చేసుకోవాలి.

జుట్టు రాలడం దూరం..

చాలా వరకూ చుండ్రు ఎక్కువగా ఉండడం వల్లే జుట్టు రాలుతుంటుంది. అలాంటప్పుడు కొబ్బరినూనెలో కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల జుట్టు సమస్యలు దూరమై జుట్టు బలంగా మారత్నుంది.

తెల్ల జుట్ట దూరం..
కర్పూరం, కొబ్బరినూనె జుట్టు పెరుగుదలలో వచ్చే సమస్యల్ని దూరం చేసి పొడవుగా, మందమైన జుట్టుని పొందేందుకు సాయపడుతుంది. ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడే సమస్యని కూడా దూరమవుతుంది.

జుట్టుకి మెరుపు..



కొంతమంది జుట్టుని చూస్తే నిర్జీవంగా మారి ఇబ్బందిగా కనిపిస్తుంది. ఇలాంటి సమస్య దూరమ–య్యేందుకు, జుట్టు మృదువుగా మారేందుకు కర్పూర నూనె బాగా హెల్ప్ అవుతుంది.

ఎలా వాడాలి..
మీకు ఎంత నూనె అవసరమో అది తీసుకుని అందులో ఒకటి లేదా రెండు కర్పూర బిళ్ళలను వేయాలి. మొత్తం కరిగాక దానిని జుట్టుకి అప్లై చేయాలి. దీని వల్ల తల చల్లగా అనిపిస్తుంది. స్కాల్ప్ సున్నితంగా మారతుంది. అలా రాశాక.. 4 గంటలు వీలైతే రాత్రంతా ఉంచండి. ఇలా వారానికి 2 నుంచి 3 సార్లు చేయండి. దీంతో బెస్ట్ బెనిఫిట్స్ మీ సొంతమవుతాయి.

# ఈ మూలికతో రక్తంలో యూరిక్ యాసిడ్స్ తగ్గుతాయట..

ఆయుర్వేదంలో ఎన్నో మూలికలు ఉన్నాయి. వీటిని అనేక సమస్యలకి పరిష్కారంగా పనిచేస్తాయి. వీటిలో ఎక్కువగా తులసి, తిప్పతీగ, అశ్వగంధ గురించే తెలుసు. కానీ, తెలుసుకోవాల్సిన మరో మూలిక కూడా ఉంది. అందులో ఒకటే నేల ఉసిరి.
ఆయుర్వేద నిపుణుల ప్రకారం..

నేల ఉసిరి లివర్, కిడ్నీ సమస్యలకి చక్కని పరిష్కారమని నోయిడా %జు%-260 సెక్టార్ 27లోని కపిల్ త్యాగి ఆయుర్వేద క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కపిల్ త్యాగి చెబుతున్నారు. దీనిని తీసుకోవడం వల్ల మరిన్ని లాభాలు కూడా ఉన్నాయని, జీర్ణక్రియ, ఇమ్యూనిటీ బలంగా మారుతుందని చెబుతున్నారు.
నేల ఉసిరి అంటే..

ఈ నేల ఉసిరి ఇప్పుడు కాదు.. సుమారు 2 వేల సంవత్సారకు ముందే ఆయుర్వేదంలో వాడారని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీని మొక్క చూడ్డానికి సన్నని ఆకులతో కొమ్మలతో నిండి ఉంటుంది. ఇది సుమారు 2 అడుగుల వరకూ పెరుగుతుంది. కేవలం ఈ మొక్క ఆకుల్నే కాదు పువ్వులు, కాండాన్ని కూడా అనేక రకాలుగా ఉపయోగిస్తారు.
కిడ్నీ సమస్యలు దూరం..

ఈ ఆయుర్వేద మూలికని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు తగ్గిపోతాయి. ఇందులోని ప్రత్యేక గుణాలు రాళ్ళని బ్రేక్ చేస్తాయి. అందుకే, దీనిని 'స్టోన్ బ్రేకర్' అంటారు. ఈ మూలికలోని ఆల్కలీన్ కిడ్నీలోని రాళ్ళని తగ్గిస్తుంది. మూత్ర విసర్జనని పెంచుతుంది. ఇతర మందుల కంటే దీనిని తీసుకోవడం వల్ల మందులా పని చేస్తుంది.
పిత్తాశయ రాళ్ళు కూడా..

దీనిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు మాత్రమే కాదు. పిత్తాశయ రాళ్ళు కూడా దూ–రమవుతాయి. ఇందులోని ఆల్కలీన్ గుణాలే దీనికి కారణం. దీనిని ఈ సమస్యలకి పరిష్కారంగా కొన్ని రోజులుగా వాడుతున్నారు.
%గూశ్రీంశీ =ఝ౦% : వీటిని తింటే గ్యాస్, మలబద్ధకం దూరమవుతాయి..
అల్సర్స్..
అల్సర్స్..

నేల ఉసిరి తీసుకోవడం వల్ల కడుపులోని అల్సర్స్ దూరమవుతాయి. కడుపులోని బ్యాక్టీరియాని దూరం చేసేందుకు ఇవి బాగా పనిచేస్తాయి. కడుపులోని సమస్యల్ని దూరం చేసేందుకు ఈ మూలిక బాగా పనిచేస్తుంది.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..



యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పుష్కలంగ ఉన్న నేల ఉసిరిని తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల డయాబెటిక్ పేషెంట్స్‌కి మంచిదని చెబుతున్నారు నిపుణులు. అయితే, దీనిని మీరు డాక్టర్ సలహాతోనే తీసుకోవాలని గుర్తుపెట్టుకోండి.
యూరిక్ యాసిడ్స్..

రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు గౌట్ సమస్య వస్తుంది. అలాంటి సమస్యని ఈ మూలిక దూరం చేస్తుంది. దీనిలో యాంటీ గౌట్ లక్షణాలు ఉంటాయి. వీటితో పాటు దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే ఆర్థరైటిస్ లక్షణాలు కూడా తగ్గుతాయి.
లివర్‌కి మంచిది..


లివర్ ఆరోగ్యాన్ని కాపాడడంలో నేల ఉసిరి ఆయుర్వేద టానిక్ అని చెప్పొచ్చు. దీనిని లివర్ ఆరోగ్యాన్ని కాపాడి, పిత్తాశయ పనితీరుని మెరుగుపరుస్తుంది.
ఇతర లాభాలు..

దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థని మెరుగుపరిచి బలంగా తయారవుతుంది. ఇమ్యూనిటీ పెరుగుతుంది. స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమై, కఫ, పిత్త దోషాలని బ్యాలెన్స్ చేస్తుంది.
ఎలా వాడాలి..

ఈ మూలికను పొడి, రసం, పేస్ట్ రూపంలో ఎలా అయినా తీసుకోవచ్చు. అయితే, డాక్టర్, ఆయుర్వేద నిపుణుల సలహాతోనే తీసుకోవాలి. వారు మిమ్మల్ని పరీక్షించి ఎంత తీసుకోవాలి.. ఎలా తీసుకోవాలో చెబుతారు. అప్పుడే మీ సమస్యలన్నీ దూరమవుతాయి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరవైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్ధలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com